క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం



వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10వేలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : వైఎస్సార్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటకు చెందిన ఆడారి మంగతల్లి ఇటీవల మృతిచెందడంతో సంబంధిత కుటుంబ సభ్యులకు తక్షణ సాయం కింద రూ.10వేలను స్థానిక మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడుతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ రెడ్డినాయుడు, సచివాలయ కన్వీనర్ ఆదికుమార్, పాలసంఘ అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు



వలంటీర్ అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

కోటవురట్ల: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్ వలంటీరు అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ పాములవాక, అన్నవరం గ్రామాలకు సంబంధించి ఒక్కో అభ్యర్థి దరఖాస్తులు ఇవ్వగా వారిని ఇంటర్వ్యూ చేసినట్టు తెలిపారు. పాములవాకకు శివకుమార్, అన్నవరం గ్రామానికి పద్మ ఇంటర్వ్యూకు హాజరైనట్టు తెలిపారు.

వికలాంగులకు ఉచిత ఉపకరణాలు

పాయకరావుపేట : జిల్లాలో గల వికలాంగులకు అవసరమైన వారికి ఉచితంగా ఉపకరణాలు అందించడం జరుగుతుందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుండి ఆదేశాలు వెలువడినట్టు తెలిపారు. ఈ నెల 26 న అనకాపల్లి, 27న చోడవరం, 28న యలమంచిలి, 29న నర్సీపట్నంలలో గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 28 న శుక్రవారం నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల వారికి యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన వికలాంగులకు అందిస్తారన్నారు. వికలాంగుల వారి వద్ద నున్న వైద్య ధ్రువీకరణ పత్రం, ఆదాయ, కుల, ఆధార్, రేషన్, ఫోటోలు తీసుకుని శిబిరాలకు వెళ్లాలని ఎంపీడీవో తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణకు మందును పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పాయకరావుపేట : పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు గ్రామ పంచాయితీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ తెలిపారు. గత ఐదు రోజులుగా పట్టణంలో దోమల నివారణకు అభిత్ మందును పిచికారీ చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా సాయంత్రం సమయంలో కూడా దోమల నివారణకు ఫాగింగ్ చేయడం జరుగుతుందన్నారు.

కోరి ఫార్మా ప్రమాదంపై దర్యాప్తు చేయాలి

అనకాపల్లి రూరల్: పరవాడ ఫార్మా పరిశ్రమలోని కోరి ఆర్గానిక్స్ పరిశ్రమలో మంగళవారం జరిగిన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో రాజారావు అనే కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడని, మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాలు కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆరోపించారు.

అక్రమ కట్టడాలపై కొరడా





పట్టణంలో ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు, అధికారులు

యలమంచిలి : ప్రభుత్వ స్థలాల్లో రోడ్లకు ఇరువైపులా అక్రమ కట్టడాలు నిర్మించరాదని మున్సిపల్ కమిషనర్ కొండలరావు అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణం డిగ్రీ కళాశాల రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన అక్రమ కట్టడాలను ఆయన పొక్లెయిన్‌తో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా తుప్పలను, మట్టిదిబ్బలను ఎత్తుపల్లాలను చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో జన సంచారం ఉన్న ప్రాంతాల్లో రోడ్లపై చిరు వ్యాపారులు వారి వ్యాపారాల కోసం రోడ్లకు ఇరువైపులా స్థలాలను ఆక్రమించడం వల్ల రవాణాకు అవాంతరాలు ఏర్పడుతున్నాయని, ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రోడ్లకిరువైపులా స్థలాలను ఆక్రమించి దుకాణాలను నడపడం చట్టరీత్యా నేరమని, ప్రజలకు ఇబ్బంది కలిగే పనులు చేయరాదని, ప్రభుత్వ స్థలాలను ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ అసిస్టెంట్లు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆరోగ్య సర్వే



వెల్చూరులో ఆరోగ్య సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

రాంబిల్లి: మండలంలో రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల పరిధిలో గల గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రాంబిల్లి , దిమిలి పీహెచ్‌సీల వైద్యాధికారులు అమృతసాయి, వెంకటేష్ ఈ సర్వే కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 21 వరకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు.



జల్లూరులో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష

కోటవురట్ల: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా సాగుతోంది. వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేయడంతో పాటు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. ఇంటికే వచ్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తుండడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్

మునగపాక : వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పల్లపు ఆనందపురంలో మంగళవారం ఆత్మ సౌజన్యంతో వరి పంటలో కీలక యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్ర పురుగులను సంరక్షించుకోవడం ద్వారా పురుగు మందు అవసరం లేకుండానే చీడ పీడలను అదుపులో పెట్టవచ్చన్నారు. అలాగే సకాలంలో కలుపు యాజమాన్యం ద్వారా తెగుళ్లు ఆశించకుండా పంటను కాపాడుకోవచ్చన్నారు. ఎరువులను మోతాదుకు మించి వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్మికుల సమస్యలపై యలమంచిలిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

యలమంచిలి : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఏసుదాసు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై పాత జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సమస్యలుపై రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 21నుండి, 27వరకు రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలుకు రాష్ట్ర సంఘం పిలుపునిచ్చిందని అందులో భాగంగా యలమంచిలి నిరసన కార్యక్రమాలు విజయవంతం చేయాలని అలాగే మున్సిపాలిటీలో ఇంజినీరింగ్, పారిశుధ్యం , కాంట్రాక్ట్ కార్మికులందరిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26వేలు అందివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ స్పందించి కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.నూకరాజు, సిహెచ్.వెంకటరమణ, డి.మహేష్, ఇ.చంద్రరావు, జె.వెంకటరమణ, ఎం.నాగరాజు, కె.నర్సింహమూర్తి, ఆదిమూర్తి పాల్గొన్నారు.

మొక్కలు పెంచే బాధ్యత అందరిదీ



మొక్కలు నాటుతున్న వైద్యాధికారి వాసంతి

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.వాసంతి అన్నారు. పీహెచ్‌సీలో పర్యావరణ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం మొక్కలను నాటారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్కలు నాటి వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ప్రాణ వాయువునిచ్చే మొక్కలు గ్రామాల్లో ఎక్కువగా పెంచేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి తంటపురెడ్డి నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జి.లిల్లీ పాల్గొన్నారు.

పండగలా నా భూమి-నా దేశం



ఆకట్టుకున్న కోలాటం



సిరసపల్లిలో సేకరించిన మట్టి, బియ్యంతో సర్పంచ్ ధనలక్ష్మి తదితరులు

మునగపాక: టి.సిరసపల్లిలో నా భూమి-నా దేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మోహినిల ఆధ్వర్యంలో గ్రామంలో సేకరించిన మట్టి, బియ్యం తదితర సామాగ్రిని పంచాయతీ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాభూమి-నా దేశం కార్యక్రమం విజయవంతంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె అభినందనలు తెలిపారు. దీనిలో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కిల్కారీ సేవలను వినియోగించుకోవాలి



తుమ్మపాల పీహెచ్‌సీలో కిల్కారీ సేవలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ఏఎన్‌ఎంలు

అనకాపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వ కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ అందుబాటులోకి తెచ్చిన కిల్కారీ సేవలను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్‌కే నస్రత్ షమీమ్ సూచించారు. మంగళవారం ఆస్పత్రి ఆవరణలో కిల్కారీ సేవలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అమలు చేస్తోందన్నారు. వాయిస్ మెసేజ్‌ల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలు వినిపిస్తాయన్నారు. అవసరమైన వైద్య పరీక్షలు, శిశువుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటింటికీ వచ్చి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు వివరిస్తారని తెలిపారు. అంతకుముందు ఏఎన్‌ఎంలు కిల్కారీ సేవలకు సంబంధించిన బ్యానర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో కిల్కారీ మొబైల్ అకాడమీ ప్రొగ్రాం అధికారి ఆర్ మోహనరావు, డాక్టర్ వాణీ జగదీశ్వరి, సీహెచ్‌వో డి.శారద, హెచ్‌వీ ఎం.మరియమ్మ, ఎంపీహెచ్‌ఎస్ బి.సంగం, పీహెచ్‌సీ పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



ఆపరేషన్ రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 38 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులు కోలుకునేంత వరకు ఆస్పత్రిలో వసతితో పాటు, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, రోగులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు భవనం వార్షికోత్సవం నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక జిల్లా న్యాయస్థానం ఎదురుగా ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు భవనం 22వ వార్షికోత్సవాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు భవన వ్యవస్థాపకుడు పిరట్ల నరసింహమూర్తి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలుసేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

రెజ్లింగ్ వీరుడు గణేష్‌కు సన్మానం



గణేష్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోటవురట్ల : రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి కాంస్య పతకం సాధించిన కన్నూరు గణేష్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. పాములవాక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన గణేష్ ఇటీవల విజయవాడ నున్నలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలో సత్తా చాటి బ్రాంజ్ మెడల్ సాధించాడు. దాంతో హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు శాలువా కప్పి అభినందించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రతిభకు కొదవ లేదన్నారు. విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను గుర్తించి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. గణేష్‌కు మరింత తర్ఫీదును ఇచ్చి జాతీయ స్థాయిలో రాణించేలా అందరూ కృషి చేయాలన్నారు.

ఉక్కు పరిరక్షణ యాత్ర జయప్రదం చేయండి..



మాట్లాడుతున్న సీఐటీయూ నేత శ్రీనివాసరావు

మునగపాక : స్టీల్‌ప్లాంట్ రక్షణ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ నేత వీవీ శ్రీనివాసరావు కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా మునగపాకలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి జరుగుతున్న విశాఖ ఉక్కు రక్షణయాత్ర ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మునగపాకకు చేరుకుంటుందన్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు ప్రజలు హాజరుకావాలన్నారు. తెలుగు ప్రజలు పోరాడి 32 మంది ప్రాణ త్యాగాలతో 16 వేల మంది రైతులు 22 వేల ఎకరాల త్యాగఫలంతో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

మౌలిక వసతుల నిర్మాణానికి కృషి



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : మునగపాక మండల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తెలిపారు. మునగపాక తులసీ కల్యాణ మండపం దరి రూ.లక్షా 40వేలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆమె మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో మునగపాక మండలానికి అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు అవసరమయ్యే నిధులు మంజూరుకు చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఆడారి అచ్చియ్యనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, వార్డు సభ్యులు వేగి కృష్ణ, ఆడారి రామప్పలనాయుడు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



ఉమ్మడి జిల్లాల త్రోబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సంధ్య లచ్చన్నాయుడు

మునగపాక(అచ్యుతాపురం): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ కోన సంధ్య లచ్చన్నాయుడు కోరారు. హరిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాల త్రోబాల్ పోటీలను ఆమె మంగళవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. కష్టపడి చదువుకోవాలని ఆకాంక్షించారు. సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ, అచ్యుతాపురం సర్పంచ్ కూండ్రపు వెంకునాయుడు, చోడపల్లి ఎంపీటీసీ లాలం శ్రీను, హెచ్‌ఎం రవి, పీడీ ధర్మిరెడ్డి పాల్గొన్నారు.


40 లీటర్ల సారాతో ఒకరి అరెస్ట్



రావికమతం: 40 లీటర్ల సారాతో నిందితుడిని అరెస్ట్ చేశామని, అతడి నుంచి టీవీఎస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని కొత్తకోట ఎస్ఐ విభీషణరావు మంగళవారం తెలిపారు. కుముందానిపేటలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో మంగళవారం దాడి చేశామన్నారు. టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై 40 లీటర్ల సారా తరలిస్తూ నిందితుడు పట్టుబడినట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వ బడులు.. డిజిటల్ తరగతులు

- ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ద్వారా బోధన
- మండలంలో 15 స్కూళ్లలో అమలు
- బ్లాక్ బోర్డుతో పనిలేకుండా విద్యాబోధన
- పాఠం ఈజీగా అర్థమవుతోంది : విద్యార్థులు



ఐఎఫ్‌పీ ద్వారా జీవశాస్త్రం బొమ్మలు వివరిస్తున్న ఉపాధ్యాయుడు

అనకాపల్లి రూరల్: పిల్లలకు మౌఖికంగా ఓ విషయాన్ని చెప్పినపుడు పూర్తిగా గుర్తు పెట్టుకోవడం కాస్త కష్టం. అదే టీవీలో చూపిస్తూ, బోధిస్తే చాలా వరకు గుర్తుంటుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో డిజిటల్ విద్యకు చర్యలు తీసుకుంది. ఇతర రాష్ట్రాల విద్యార్థులతో మన విద్యార్థులు పోటీ పడేలా డిజిటల్ బోధనను అమలులోకి తెచ్చింది.

బోధనలో సాంకేతికత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ బడుల్లో అనేక సౌకర్యాలు కల్పించారు. ఈ నేపథ్యంలోనే తొలుత బ్లాక్ బోర్డులకు బదులుగా గ్రీన్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది గ్రీన్ బోర్డుల స్థానంలో ఒక్కొక్కటీ రూ.1.30 లక్షలు విలువైన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ)లను, స్మార్ట్ టీవీలను తీసుకొచ్చింది. ప్రస్తుతం వీటి ద్వారానే ప్రభుత్వ బడుల్లో బోధన జరుగుతోంది. ప్రభుత్వ విద్యారంగంలో నవశకానికి నాంది పలుకుతున్న డిజిటల్ విద్య విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చడానికి ఉపయోగపడుతుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. సంప్రదాయ పద్ధతిలో బోర్డుపై రాయడం, పాఠ్యపుస్తకాలను చేత పట్టుకుని బోధించడం కొంత మంది విద్యార్థుల్ని ఆకట్టుకోని పరిస్థితి. వారిని చదువు వైపు ఆకర్షించడానికి డిజిటల్ విద్య ఎంతగానో ఉపయోగపడుతోంది. స్మార్ట్ టీవీల వినియోగం కోసం పాఠశాలలకు ఇంటర్నెట్ సౌకర్యం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

సమయం ఆదా.. బోధన అర్థవంతం

ప్రతి పీరియడ్‌కు కేవలం 45 నిమిషాలు మాత్రమే సమయం. గతంలో లెక్కలు, సైన్సు, సోషల్ పాఠ్యాంశాల బోధనలో బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో బొమ్మలు, మ్యాప్‌లు వేసి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించేవారు. ఇవి వేయడానికే దాదాపు 15 నుంచి 20 నిమిషాల సమయం వృథా అయ్యేది. ఇపుడా పరిస్థితి లేదు. క్లిక్ చేసిన వెంటనే వివిధ రంగుల్లో బొమ్మలు ప్రత్యక్షమై బోధన సులభతరం అవుతోంది. విద్యార్థులకు కాస్త కష్టంగా అనిపించే పాఠ్యాంశాలు కూడా దృశ్య విధానం ద్వారా బోధనతో ఎక్కువ కాలం గుర్తుండిపోతుంది.

మండలంలో 3 వేల మందికి డిజిటల్ బోధన

అనకాపల్లి మండలం, పట్టణంలో మొదటి విడతగా మనబడి నాడు-నేడు పథకంలో ఎంపికైన 15 పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. మామిడిపాలెం, సీతానగరం, కూండ్రం, తుమ్మపాల, కె.కొప్పాక జెడ్పీ హైస్కూళ్లు, జీవీఎంసీ ప్రధాన హైస్కూల్, ఎంజీజీహెచ్‌ఎస్(వార్డు 27), ఎంపీఎల్‌హెచ్‌ఎస్ గాంధీనగరం, ఎంపీఎల్‌హెచ్‌ఎస్ గవరపాలెం 28వ వార్డు, ఎంపీఎల్‌హెచ్‌ఎస్ టౌన్ గర్ల్స్ హైస్కూల్, ఎంపీయూపీఎస్ కుంచంగి, బవులువాడ, రాంపురం, శంకరం, ఎరుకువానిపాలెంలలో 99 ఐఎఫ్‌పీలు, 25 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసి బోధనకు వినియోగిస్తున్నారు. వీటి ద్వారా సుమారు 3 వేల మంది విద్యార్థులకు డిజిటల్ బోధన అందుతోందని అధికారులు చెబుతున్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



మండపారాధనలో అర్చకులు, ఆలయ అధికారులు

అనకాపల్లిటౌన్: స్థానిక దేవునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు ఐదోరోజు అత్యంత వేడుకగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ బేడా మండపంలో స్వామివారికి హోమాలు, సాయంత్రం ఏకోత్తర సహస్ర కలశ స్థాపన, మండపారాధన, అష్టోత్తర శతక స్థాపన జరిపారు. ముందుగా స్వామివారికి అర్చకులు పులఖండం గిరిబాబు, విజయ్‌బాబులు సుప్రభాత సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సకలా రాజ్యలక్ష్మి, ఈవో ఆదినారాయణ, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.